| **Headline**: All about Sovereign Gold Bond | |
|---|---|
| **Source:** Sakshi | **Date:** 5 September 2016 |

# గోల్డ్ బాండ్లు.. పెట్టుబడులకు బంగారం

ఎన్నో ఏళ్లుగా భారతీయులకు పసిడి ఒక పెట్టుబడి సాధనమే. పెరుగుతున్న ధరలను తట్టుకునేందుకు, కరెన్సీ ఒడిదుడుకుల సందర్భంలో ఆర్థిక రక్షణ కవచంగా బంగారాన్ని చూస్తారు. బంగారానికి గృహ వినియోగదారులు ఇస్తున్న ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ) పథకాన్ని 2015 యూనియన్ బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా అదే ఏడాది అక్టోబర్ 30న పథకం ప్రారంభమైంది. పసిడికి భౌతికంగా డిమాండ్ తగ్గించడం తద్వారా దిగుమతులకు సంబంధించి క్రూడ్ తరువాత రెండవ స్థానంలో ఉన్న ఈ మెటల్ దిగుమతిని కట్టడి చేయడం, దేశంలోకి వచ్చి,పోయే విదేశీ మారక ద్రవ్య నిల్వల మధ్య వ్యత్యాసం- కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) కట్టడి, తద్వారా రూపాయి విలువ స్థిరీకరణ వంటి ఎన్నో అంశాలూ ఈ పథకం ప్రవేశపెట్టడానికి కారణమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా సెప్టెంబర్ 1 నుంచీ ప్రారంభమైన ఐదవ విడత గోల్డ్ బాండ్ పథకం 9వ తేదీన ముగుస్తుంది. ఇప్పటి వరకూ పూర్తయిన 4 విడతల్లో ఈ పథకానికి స్పందన సంతృప్తికరంగా ఉంది. నాలుగో విడత గోల్డ్ బాండ్ల జారీ ద్వారా ప్రభుత్వం రూ. 919 కోట్లు సమీకరించింది. మొత్తం నాలుగు విడతల్లో రూ. 2,292 కోట్ల విలువైన పెట్టుబడులను సేకరించింది.

- సునీతా ఆనంద్, రీజనల్ హెడ్, ఎస్ఎస్‌ఈ



## ప్రయోజనాలు ఎన్నో...

| అంశాలు | ఫిజికల్ గోల్డ్ | సావరిన్ గోల్డ్ బాండ్ |
|---|---|---|
| తయారీ రుసుములు | ఆభరణాల విషయంలో 10 శాతం నుంచి 20 శాతం మేకింగ్ చార్జీలు | వర్తించదు |
| స్వచ్ఛత | ఇప్పుడు ఎప్పుడూ ప్రశ్నార్థకమే | సమస్యే ఉండదు |
| నిర్వహణ | దగ్గర ఉంచుకోవడం ఎప్పుడూ సమస్యే | ఇబ్బంది ఉండదు |
| సంపద పన్ను | అసెట్స్ లెక్కకట్టే సందర్భంలో ప్రతి ఏడాదీ ఒక శాతం పన్ను | వర్తించదు |
| రిటర్న్స్ | అవసరమైన సమయంలో వెంటనే తగిన ధరకు అమ్మలేం | పసిడి ధర ప్లస్ స్థిర వడ్డీ |
| ట్రేడబిలిటీ | మార్పిడి తప్ప తిరిగి కొనుగోళ్లు కష్టం | ఎక్స్ఛేంజీలో తేలిగ్గా ట్రేడింగ్ |
| స్టోరేజ్ వ్యయం | లాకర్ ఖర్చుల భారం | అలాంటి ఇబ్బందీ లేదు |
| హామీ | సాధ్యం | సాధ్యం |
| క్రెడిట్ రిస్క్ | వర్తించదు | సావరిన్ గ్యారెంటీ |



### పన్ను ప్రయోజనాలు...

బాండ్ వడ్డీపై సోర్స్ వద్ద పన్ను కోత (టీడీఎస్) ఉండదు. మెచ్యూరిటీకి ముందే బాండ్ ట్రాన్స్‌ఫర్ అయితే ఇండెక్సేషన్ ప్రయోజనాలు లభ్యమవుతాయి. మూడేళ్ల తరువాత దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ వర్తిస్తుంది. గడువుదాకా ఉంచుకుంటే మాత్రం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడబోదు.

### ఇప్పుడు అందుబాటులో...

- సెప్టెంబర్ 1 నుంచీ ప్రారంభమైన ఐదవ విడత గోల్డ్ బాండ్ పథకం 9వ తేదీన ముగుస్తుంది.
- బాండ్ల జారీ 23 వ తేదీన జరుగుతుంది.
- కేంద్ర ప్రభుత్వం తరఫున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బాండ్లను జారీ చేస్తుంది.
- తాజా ఇష్యూ ధర గ్రాముకు రూ.3,150.
- బాండ్ల తొలి పెట్టుబడిపై వార్షిక స్థిర వడ్డీరేటు 2.75 శాతం.
- ఆరు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లింపులు ఉంటాయి.



- గ్రాము నుంచి 500 గ్రాముల వరకూ విలువైన బాండ్ల కొనుగోలుకు వీలుంది.
- ఏడాదికి ఒకరు 500 గ్రాముల వరకూ పసిడిని కొనుగోలు చేసే వీలుంది.
- బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌హెచ్‌సీఐఎల్), కొన్ని పోస్టాఫీసులు, ఎన్ఎస్ఈ, బీఎస్ఈల ద్వారా సావరిన్ గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసే అవకాశం ఉంది.

### క్యాష్ ఎప్పుడు కావాలంటే అప్పుడు...

జారీ అయిన బాండ్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడవుతాయి. ఇప్పటికి పూర్తయిన నాలుగు విడతల్లో మూడు విడతల బాండ్ల ట్రేడింగ్ ప్రారంభమయ్యింది. తమ బాండ్లను నగదుగా మార్చుకోవాలనుకునే ఇన్వెస్టర్లు ఎక్స్ఛేంజ్ రిజిస్టర్డ్ ట్రేడింగ్ మెంబర్స్ ద్వారా తమ హోల్డింగ్స్‌ను వేరే ఇన్వెస్టర్‌కు విక్రయించవచ్చు. లేదా ఐదేళ్ల వరకూ వేచివుండి ప్రభుత్వం ద్వారా తమ బాండ్లకు తగిన సొమ్మును తిరిగి పొందవచ్చు. లేదా ఎనిమిది సంవత్సరాల తర్వాత బాండ్ కాలపరిమితి మామూలుగానే ముగుస్తుంది.

### 4 విడతల్లో ఆకర్షణ విధమిది

| విడతలు | కేజీలు | విలువ(రూ. కోట్లలో) |
|---|---|---|
| 1 | 915.95 | 246 |
| 2 | 3,071.00 | 798 |
| 3 | 1,126.00 | 329 |
| 4 | 2,950.00 | 919 |
| మొత్తం | 8,064.95 | 2,292 |



**Link for epaper:** http://epaper.sakshi.com/927208/Andhra-Pradesh/05-09-2016#page/11